# ఆధునిక భారతదేశ చరిత్ర

## సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు

### రామకృష్ణ మిషన్

1897లో స్వామి వివేకానంద కలకత్తాలోని బేలూర్‌లో రామకృష్ణ మిషన్‌ను స్థాపించాడు. తన గురువైన రామకృష్ణ పరమహంస బోధనలను ప్రచారం చేయడానికే ఈ సంస్థను స్థాపించాడు. (వాస్తవానికి 1897లో కాశీపూర్ సమీపంలోని బరానగర్‌లో వివేకానందుడు తొలి ఆశ్రమాన్ని స్థాపించి, 1899లో కలకత్తా సమీపంలోని బేలూరులో రామకృష్ణ మఠాన్ని నెలకొల్పాడు). 'మానవ సేవే మాధవ సేవ' అనే రామకృష్ణ పరమహంస సందేశం రామకృష్ణ మిషన్ నినాదమైంది. భారతీయ సంస్కృతిని ప్రపంచ దేశాల్లో ప్రచారం చేసిన స్వామి వివేకానందుడు రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు.

### రామకృష్ణ పరమహంస

రామకృష్ణ పరమహంస అసలు పేరు గదాధర చటోపాధ్యాయ లేదా గదాధరుడు. 1833లో బెంగాల్‌లోని కామర్‌కుర్/కామర్పకూర్ గ్రామంలో జన్మించాడు. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో రాసమణిదేవి నిర్మించిన కాళికామాత ఆలయంలో తన అన్న రామకుమార్ ఛటర్జీ అనంతరం అర్చకుడిగా చేరాడు. రామకృష్ణుడి గురువు తోతాపురి. గదాధరుడికి అయిదేళ్ల వయసున్న శారదామణి (శారదామాత)తో బాల్య వివాహం జరిగింది. రామకృష్ణుడు సాంఘిక, మత సంస్కరణలకు అధిక ప్రాధాన్యమిచ్చాడు. 'వివిధ మతాలు భగవంతుడిని చేరుకోవడానికి ఉన్న వివిధ మార్గాలు. నదులన్నీ సముద్రంలో కలిసినట్లే, మతాలన్నీ భగవంతుడిలో విలీనమవుతాయని' ప్రచారం చేశాడు. వర్ణ వ్యవస్థను, కులపరమైన విభేదాలను ఖండిస్తూ సహపంక్తి భోజనాలను ప్రవేశపెట్టాడు. రామకృష్ణ పరమహంస 1886లో అనారోగ్య కారణంతో కాశీపూర్‌లో మరణించాడు.

### పార్శీ మత సంస్కరణోద్యమం

ప్రాచీన కాలంలోనే పారశీకులు భారతదేశంపై దండెత్తి వచ్చారు. ఫలితంగా భారతీయులతో పారశీకులకు సంబంధాలు ఏర్పడ్డాయి. క్రీ.శ. 8వ శతాబ్దంలో అనేకమంది పారశీకులు (ఇరానియన్లు) గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతాలకు వచ్చారు. కానీ ఎక్కువగా బొంబాయిలో స్థిరపడ్డారు. హిందూ మత సంస్కరణ ఉద్యమ ప్రభావంతో పారశీకులు కూడా సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. బొంబాయిలోని ఎలిఫిన్‌స్టన్ కళాశాలలో చదివిన పారశీక విద్యావంతులు ఆధునిక భావాలను ప్రచారం చేయడం ప్రారంభించారు. 1851లో నౌరోజీ ఫరందోజీ 'రహ్నా మాయెమస్ దయానన్' సంస్కరణ సంఘాన్ని స్థాపించాడు. 1858లో పార్శీ బాలికా పాఠశాల సంఘాన్ని ఏర్పాటు చేశారు. స్త్రీబోధ్, దస్త్ గఫ్తర్ లాంటి పత్రికలను స్థాపించి సంస్కరణ ఉద్యమాన్ని ప్రచారం చేశారు. దాదాబాయి నౌరోజీ, షాపూర్‌జీలు వితంతు వివాహ సంఘాన్ని స్థాపించారు. 1910లో పార్శీ మహాసభను నిర్వహించారు. దాదాభాయ్ నౌరోజీ తన 'పావర్టీ అండ్ అన్‌బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా' అనే పుస్తకంతో సంపద తరలింపు సిద్ధాంతం/ డ్రైన్ సిద్ధాంతాన్ని ప్రచురించారు. ఖుర్షీద్ నారీమన్ బొంబాయిలో ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించిన తొలి బొంబాయి పౌరుడిగా ప్రసిద్ధి చెందాడు. బొంబాయి రాష్ట్రం (ప్రెసిడెన్సీ)లో బద్రుద్దీన్ త్యాబ్జీ, సంయుక్త పరగణాలు(యూపీ)లో షేక్ అబ్దుల్ హలీల్ షరార్ సంస్కరణ ఉద్యమాలను ప్రచారం చేశారు. ఈ విధంగా భారతదేశంలోని అనేకమంది పారశీక సంఘ సంస్కర్తలు సంస్కరణ ఉద్యమాలను నడిపారు.

### అలీఘర్ ఉద్యమం

వాస్తవంగా ముస్లింల సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాన్ని అలీఘర్ ఉద్యమంగా పేర్కొంటారు. దీన్ని ప్రారంభించింది సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్. ఈయన భారతీయ ముస్లిం సంఘ సంస్కర్తల్లో ముఖ్యమైన వ్యక్తి. ఉత్తర్ ప్రదేశ్‌లోని బరేలీకి చెందిన సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ మత సత్యాలు, సంప్రదాయాలను హేతువాదంతో సమన్వయ పరచడం, సచ్ఛీలతను – నైతిక ప్రవర్తనను పెంపొందించడం, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని సమగ్రంగా బోధించడం లాంటి లక్ష్యాలతో ఇతడు మూడంచెల విద్యా వ్యవస్థలను స్థాపించాడు. 1875లో అలీఘర్ కేంద్రంగా ఆంగ్లో – ఓరియంటల్ కళాశాలను స్థాపించాడు. అదే తర్వాతి కాలంలో అలీఘర్ విశ్వవిద్యాలయంగా మారింది. అలీఘర్ కేంద్రంగా అహ్మద్‌ఖాన్ నడిపిన ఉద్యమమే అలీఘర్ ఉద్యమంగా పేరొందింది. మొదట్లో జాతీయవాదిగా ఉన్న అహ్మద్‌ఖాన్ 'సుందర భారత వధువుకు హిందువులు, ముస్లింలు రెండు కళ్లలాంటివారు' అని ప్రకటించాడు. కానీ అలీఘర్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడైన థియోడర్ బెక్ ప్రభావంతో ముస్లిం మతవాదిగా మారిపోయిన అహ్మద్‌ఖాన్ హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతులని (మీరట్ ఉపన్యాసంలో) ప్రకటించాడు.

1859లో అహ్మద్‌ఖాన్ విధేయులైన భారతీయ ముస్లింలు, సిపాయిల తిరుగుబాటుకు కారణాలు అనే గ్రంథాలు రాశాడు. 'ఖురాన్ వైపు మరలండి' అనే నినాదాన్ని ఇచ్చాడు. 'తహరీక్ ఉల్ అఖ్లాఖ్' అనే పత్రికను ప్రారంభించాడు. థియోడర్‌బెక్ ప్రోత్సాహంతో అలీఘర్‌లో 1893లో 'మహ్మదీయ రక్షణ సమితి'ని స్థాపించాడు. 'భావ స్వాతంత్ర్యం వికసించనంత వరకు నాగరిక జీవితమనేది ఉండజాలదు' అని వ్యాఖ్యానించాడు. 'మూసిన మనసు సామాజికమైన, మేధా సంబంధమైన వెనకబాటుతనానికి ప్రతీక' అని చాటాడు. అన్ని మతాల్లో ఒకానొక అంతర్గతమైన ఏకత్వం ఇమిడి ఉందని పలికిన వ్యక్తి చివరికి ముస్లిం మతవాదిగా మారిపోయాడు.

## ముస్లింల మత సంస్కరణ ఉద్యమం

హిందూ మతంలో ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమం ఇస్లాం మతంపై ప్రభావాన్ని చూపింది. ఫలితంగా ముస్లింలు తమ మతం, సంఘంలో ఉన్న బహు భార్యత్వం, పరదా పద్ధతి, కుల వ్యవస్థ లాంటి సాంఘిక దురాచారాలను తొలగించడానికి, స్త్రీ విద్యా వ్యాప్తి కోసం సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. బెంగాల్ కేంద్రంగా షరియతుల్లా నాయకత్వంలో ఫెరైజీ ఉద్యమాన్ని నిర్వహించారు. 1830 – 57 మధ్య బిహార్, బెంగాల్ ప్రాంతాల్లో ముస్లింలు వహాబీ ఉద్యమాన్ని నడిపారు. షా వలీయుల్లా, షా అబ్దుల్ అజీజ్, సయ్యద్ అహ్మద్‌ఖాన్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లాలో ఉన్న దేవ్‌బంద్ కేంద్రంగా దర్-ఉల్-ఉలూమ్ దేవ్‌బంద్/ దియోబంద్ ఉద్యమాన్ని నడిపారు. 1867లో స్థాపించిన విద్యా సంస్థలో దర్-ఉల్-ఉలూమ్ రూపొందించిన సంప్రదాయ విద్యాప్రణాళికను అమలు చేశారు. ముస్లింలు భారత జాతీయ కాంగ్రెస్‌తో సహకరించాలని దేవ్‌బంద్ అధ్యక్షుడైన రషీద్ అహ్మద్ గంగోహి పిలుపునిచ్చాడు. రషీద్ అహ్మద్ గంగోహీ (గంగోవాలా), మహ్మద్ ఖాసిం నానాతాపీలు లక్నోలో దారుల్ ఉలూమ్ పాఠశాలను స్థాపించారు. ప్రాచ్య-పాశ్చాత్య భాషలతో కూడిన ఉమ్మడి విద్యా ప్రణాళికను హిబ్లీ నుమానీ ప్రవేశపెట్టాడు. 1863లో నవాబ్ అబ్దుల్ లతీఫ్ 'మహ్మదన్ లిటరరీ సొసైటీ ఆఫ్ కలకత్తా' అనే సంస్థను స్థాపించి ముస్లింల విద్యా వ్యాప్తికి కృషి చేశాడు. సంప్రదాయిక ముస్లింలు షా వలీయుల్లా నాయకత్వంలో దిల్లీలో ఒక మదరసాను నెలకొల్పారు. అతడి కుమారుడు షా అబ్దుల్ అజీజ్ ఆంగ్లేయులపై జిహాద్ ప్రకటించాడు. షిబ్లి, నుమానీ మహ్మద్ హసన్, ఉబైదుల్లా సింధీ లాంటి ముస్లిం సంఘసంస్కర్తలు హిందూ–ముస్లిం ఐక్యతకు కృషి చేశారు.

## స్వామి వివేకానంద

స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్రనాథ్ దత్. 1863, జనవరి 12న కలకత్తాలో జన్మించాడు. కలకత్తా రాష్ట్రీయ కళాశాలలో న్యాయ శాస్త్రాన్ని అభ్యసించాడు. మొదట బ్రహ్మ సమాజికులతో చేరి విగ్రహారాధనను ఖండించాడు. కానీ రామకృష్ణ పరమహంస శిష్యుడిగా మారిన తర్వాత విగ్రహారాధనలో విశేషార్థమున్నదని గ్రహించాడు. విజ్ఞాన శాస్త్రానికి, బాహ్య జ్ఞానానికి ఏ పరిశోధనా పద్ధతులను వర్తింపజేస్తామో, మతం అనే శాస్త్రానికి కూడా అవే పద్ధతులను అనువర్తింపజేయాలని స్వామి వివేకానంద పేర్కొన్నాడు. భారతీయ ఉపనిషత్తుల్లోని బోధనలకు అత్యంత ప్రాధాన్యమిచ్చాడు. 1893లో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో ప్రసంగించి హైందవ మత గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేశాడు. 'నేను సోషలిస్ట్‌ను' అని ప్రకటించుకున్న తొలి భారతీయుడు వివేకానందుడే. ఇతడు ప్రబుద్ధ భారత్ (ఆంగ్ల భాష), ఉద్బోధ (బెంగాలీ భాష) అనే పత్రికలను ప్రారంభించాడు. నా గురువు, రాజయోగ, కర్మయోగ, భక్తియోగ గ్రంథాలను రాశాడు. 'మన మాతృదేశానికి హిందూ-ఇస్లాం మహా వ్యవస్థల కూడలి ఏకైక ఆశాకిరణం' అని పేర్కొన్నాడు. 'మనం ప్రపంచంలోని ఇతర జాతులతో సంబంధం పెట్టుకోకుండా వేరుపడిపోవడమే మన దౌర్భాగ్యానికి కారణమని, మనం మళ్లీ మిగతా ప్రపంచపు వెల్లువలో కలవడమే తరుణోపాయం' అని ప్రకటించాడు. 'అన్ని జాతుల్లో ఉన్న పేదలే నేను విశ్వసించే ఏకైక దైవం' అని పేర్కొన్నాడు. భారతదేశ యువతను జాతీయ చైతన్యం పెంపొందించుకునేలా చేసి 'ఆధునిక జాతీయతా పితామహుడు'గా పేరొందాడు. వివేకానందుడు అతి చిన్న వయసులోనే 1902, జులై 4న మరణించాడు. నేటికీ భారతదేశంలో తన సేవలను అందిస్తున్న ఏకైక సంస్థ రామకృష్ణ మిషన్.

## దివ్యజ్ఞాన సమాజం

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మేడం బ్లావెట్‌స్కీ, కల్నల్ ఆల్కాట్ 1875లో దివ్యజ్ఞాన సమాజాన్ని (థియోసోఫికల్ సొసైటీ) స్థాపించారు. థియోస్ అంటే దైవం, సోఫియా అంటే జ్ఞానం. అందుకే దీన్ని తెలుగులో 'దివ్యజ్ఞాన సమాజం'గా పిలిచారు. ఈ సమాజ ప్రధాన కేంద్రాన్ని 1879లో బొంబాయికి, 1882లో మద్రాస్ వద్ద ఉన్న అడయార్‌కు మార్చారు. బ్లావెట్‌స్కీ 'రహస్య సిద్ధాంతం' అనే గ్రంథాన్ని రాశారు. ఆమె మరణానంతరం కల్నల్ ఆల్కాట్ ఈ సమాజానికి నాయకత్వం వహించాడు. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణానంతరం అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలైంది. ఈ సమాజం సాంఘిక, మత సంస్కరణతోపాటు రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడానికి కూడా కృషి చేసింది. ఆంధ్రదేశంలోని రాజమండ్రిలో దివ్యజ్ఞాన సమాజ శాఖను నెలకొల్పారు. అనిబిసెంట్ 1888లోనే ఇంగ్లండ్‌లో దివ్యజ్ఞాన సమాజంలో చేరారు.



www.eenadupratibha.net

## సిక్కు మత సంస్కరణ ఉద్యమం

గురునానక్ స్థాపించిన సిక్కు మతం క్రమంగా రాజకీయంగా ఏకమై రంజిత్‌సింగ్ నాయకత్వంలో స్వతంత్ర సిక్కు రాజ్యంగా రూపాంతరం చెందింది. సిక్కులు కూడా తమ మతం, సంఘంలో ఉన్న లోపాలను తొలగించడానికి సంస్కరణ ఉద్యమాలను నడిపారు. భాయి దయాళ్ సింగ్ రావల్పిండి ప్రధాన కేంద్రంగా నిరంకారీ ఉద్యమాన్ని నడిపాడు. విగ్రహారాధన, కర్మకాండలను విడిచిపెట్టమని, ఆనంద్ పద్ధతిలో వివాహాలు జరుపుకోవాలని, నిరాకారుడైన భగవంతుడిని మాత్రమే పూజించాలని ప్రబోధించాడు. అతడి కుమారుడైన భాయి దర్బార్‌సింగ్ నిరంకారీ ఉద్యమానికి నాయకుడై ఆనంద్ వివాహ పద్ధతిని ప్రోత్సహించాడు. భాయి రాంసింగ్ 'నామ్‌ధారీ' ఉద్యమన్ని నడిపాడు. సిక్కుల్లోని మరో వర్గం గోవధను వ్యతిరేకిస్తూ, కసాయివారిని హత్య చేస్తూ, దేవాలయాలు, సమాధులు, శ్మశానాలు నాశనం చేస్తూ 'కూకా' ఉద్యమాన్ని ప్రారంభించింది. 1873లోనే సిక్కులు తొలి సింగ్‌సభను ఏర్పాటు చేసుకున్నారు. 1920లో రాజకీయ పార్టీగా అకాళీదళ్‌ను స్థాపించారు. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీని ఏర్పాటు చేశారు.

ఆధునిక భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్దంలో ప్రారంభమైన వివిధ మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలనే సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమంగా చరిత్రకారులు అభివర్ణించారు. ఈ ఉద్యమాల వల్ల అటు మతంలో ఇటు సంఘంలో అనేక సంస్కరణలు జరిగాయి. అనుకూల అంశాలతో పాటు కొన్ని ప్రతికూల అంశాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా నిమ్న వర్గాల, కుల వ్యతిరేక పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. అనేక సాంఘిక దురాచారాలను నిషేధించారు.

**రచయిత: బొత్స నాగరాజు**